# నీతి

సామిరెడ్డి జమున

**న్యాయమూర్తి** ఇచ్చిన తీర్పు విని కోర్టులో ఉన్న జనంలో అలజడి రేగింది. అక్కడ చేరిన జనం అంతా 'ఇది అబద్ధం, ఇది అబద్ధం'. అని అరుస్తున్నారు. ఎక్కడో మోసం జరిగింది, ఎక్కడో మోసం జరిగిందని కలవర పడుతున్నారు.

"ఈ హత్య ఎవరో చేసి అమాయకుడైన మధుమూర్తి పైకి నెట్టేసి, లేదా ఏదో బలమైన కారణాల వల్ల ఇతధే ఆ నేరాన్ని తన నెత్తిన వేసుకుని తానే దోషిగా ఒప్పుకుంటున్నాడు" అని ఆవేదన పడిపోతున్నారు.

అందరికీ దూరంగా మవునంగా చేతులు కట్టుకుని, చెట్టు కానుకుని నిలబడి ఉంది పద్మావతీదేవి.

అందరి మధ్యనుండి నిర్లిప్తంగా పోలీసుల వెంట నడిచి, సంకెళ్ళతో వాన్ ఎక్కాడు మధుమూర్తి.

• • • •

కటిక నేలమీద పడుకున్న మధు ఉలిక్కి పడి లేచి కూర్చున్నాడు. అతనికి తన బాధ ఎవరితోనైనా పంచుకోకుంటే భరించలే డనిపిస్తూంది. కేసు జరిగినన్ని రోజులు అణిగి ఉన్న బాధ ఇక దాగ నంటూంది. జరిగిపోయిన ఘోరం తలుచుకుంటే అతని గుండెలోనుండి ఏదో అలజడి జర జర శరీర మంతా పాకుతూంది. తన ప్రియాతి ప్రియమైన వ్యక్తి ఈ లోకంలో లేడు అనుకుంటే అతనికి దుఃఖం ఆగడం లేదు అన్ని రోజుల తరవాత. ఆ అర్ధరాత్రి ఆ జైలు గోడల మధ్య వెక్కి వెక్కి ఏడ్చాడు మధు.

"ఛస్! ఎవడ్రా వీడు—పగలంతా గొడ్డు చాకిరీ చేసి రాత్రయినా నిద్రలో సుఖ పడడం తెలియని చవట! పడుకో. పడుకో! మరలా పొద్దున్నే నీ మొగుడు డ్యూటీకి తోలుకు పోవడానికి వస్తాడు!" పక్కనే పడుకుని ఉన్న తోటి ఖైదీ వోదార్చాడు.

తన బాధను పంచుకోవడానికి అతనికి ఆ అర్ధరాత్రి ఎవరూ కనిపించ లేదు. తల్లిదండ్రులు గుర్తొచ్చారు. 'నాన్న పోయాక అమ్మయినా పిరికిదానిలా చనిపోకుండా ఉండి ఉంటే తన చెల్లెలికి రక్షణగా నయినా మిగిలేది.' నిట్టూర్చి మరలా ఆ కటిక నేల మీద మేను వాల్చాడు.

• • •

మధుమూర్తి పధ్నాలుగవ ఏడు వచ్చేవరకు సిరిలో పెరిగాడు. పదేళ్ళ వయస్సుకే మధు స్నేహ బృందం 'మధుబాబుకీ జై' అంటే, వాళ్ళ కంతా పది రూపాయల నోట్లు పంచేవాడు. పొగడ్తలకు పెద్దవారే లొంగి పోతున్నప్పుడు పదేళ్ళ పసివాడు లొంగడంతో తప్పు లేదు. ఆ తప్పు ఇవ్వకూడని వయసులో ఎంత అడిగితే అంత ఇచ్చిన పెద్ద వాళ్ళది. విపరీతమైన మురిపెంలో అతనికి చదు వబ్బ లేదు. "మోతుబరి రైతు" అని పేరు గాంచిన మధు తండ్రి బేషజాలకు పోయి ఆఖరుకు ఆస్తిని హారతి కర్పూరంచేసి, పధ్నాలుగేళ్ళ మధుని, ఎనిమిదేళ్ళ సుజీవనను భార్యకు ఆస్తిగా మిగిల్చి కన్ను మూశాడు. ఐశ్వర్యానికి అలవాటు పడిన ఆవిడ పధ్నాలుగేళ్ళ





కొడుకుని పద్దెనిమిదేళ్ళ వాడిగ అదే రీతిగా అప్పులతో పెంచి,ఇక తన కా శక్తి ఉడిగి,తన బిడ్డలను ఆ స్థితిలో చూడ్డం ఇష్టంలేక వజ్రం పొడి చేసుకుని మింగి బాధ్యతల నుండి తప్పుకుంది.

ఆత్మహత్య పిరికితనమా? అతి ధైర్యమా? అర్థం కాలేదు పద్దెనిమిదేళ్ళ మధుకు.

రాజసాన్ని, ఆత్మాభిమానాన్ని జీర్ణించుకున్న మధు అప్పుల వాళ్ళను చూచి చలించి పోలేదు. ఆస్తిని కొంత అమ్మేసి ముఖ్యమైన అప్పులు తీర్చి, మిగిలిన ఆస్తితో చూపరులకు గాంభీర్యంగా కనిపిస్తూ, ఆస్తిని మించిన అప్పులు తలుచుకుని లోపల కుమిలిపోసాగాడు.


సుజీవన చిన్న చిన్న కోరికలు సులభంగానే తీర్చగలిగాడు నాలుగు సంవత్సరాలు. నాలుగేళ్ళ తన కోరికలకు ఏ అడ్డంకి లేకపోయేసరికి సుజీ లేత మనసు సహజంగానే కోరికలకు అలవాటుపడిపోయింది.

వయసు పెరిగే కొలదీ సుజీవన కోరికలు కూడా పెరగసాగాయి. ఆ కోరికలకు ప్రాణం పోస్తూ తన కోరికలను నిర్దాక్షిణ్యంగా చంపేసుకున్నాడే కాని, తన చెల్లెలికి ఆస్తి వివరాలు కానీ, అప్పుల వివరాలు కానీ చెప్పదలుచుకోలేదు. నాన్నగారు తనని పెంచిన రీతిలో గాకపోయినా చెల్లెల్ని లేమిలో పెంచదలుచుకోలేదు. ఇక్కడే మధు పెద్ద పొరపాటు చేశాడు. దానికి పర్యవసానంగా సుజీవన ప్రతి చిన్న కోర్కెకు అన్నను సతాయించేది 'నాన్నగారుంటే నన్నిలా పెంచేవారా?' అంటూ.

సుజీవన టెన్త్ పాస్ అయింది! మూడు మైళ్ళ దూరంలో ఉన్న టౌన్ కెళ్ళి చదువుకుని సాయంత్రానికి బస్‌లో ఇంటికి రమ్మని చెప్పిన మధు మాటలు సుజీ చెవి కెక్కలేదు.

"అసహ్యంగా ఆ బస్సులో పడి రోజూ రావాల్సిన కర్మ నా కేమిటి? నన్ను హాస్టల్‌లో చేర్చు" అని మొండి కేసింది. పైగా "ఆ కాటన్ చొక్కా లేమిటి ఉత్త పిసినారి వాడివి" అని విసుక్కునేది.

సుజీవనను హాస్టల్‌లో చేర్చినప్పటి నుండి మధుకి ఆర్థిక సమస్య మరీ జటిల మయిపోయింది. హాస్టల్‌లో




తన తోటి పిల్లలకు అవి ఉన్నాయి, ఇవి ఉన్నాయి, నాకు లేవంటూ పేచీ పెట్టేది పదహారేళ్ళ సుజీవన.

• • • •

ఇంటర్ రెండవ సంవత్సరంలో ఉన్న సుజీవన స్నేహాలు అంతస్తుకు తగ్గట్టే ఉండాలనే అమాయకత్వం తాలూకు అహంభావం, ఆ ఉరికే రక్తంలో ప్రవహించే ఆవేశంతో వివేకం పూర్తిగా నశించి ఒక గొప్పింటి సరదా పురుషుడితో పరిచయం పెంచుకుంది. పరిచయం పెళ్ళిదాకా వెళుతుందనే భ్రమలో కాలు జారింది.

తాను పొరపాటు చేయలేదనీ, తన అంతస్తుకు తగ్గ వ్యక్తినే ఎన్నుకున్నందుకు అన్న సంతోషిస్తాడనీ, వైభవంగా పెళ్ళి చేస్తాడనీ కలలు కంది. ఆ కలలు కల్లలయ్యాయి. ఆమెను లోబరుచుకొనడానికి ఎంతో సమయం ఖర్చు చేసిన ఆ జల్సారాయుడు "పెళ్ళి కాకముందే నాతో ఉన్న నీవు ఇంకెంత మందితో తిరిగావో?" అనే మాటలతో పెళ్ళికి తన అసమ్మతిని అందంగా తెలియజేశాడు.

సుజీవన కిది పెద్ద ఎదురు దెబ్బ.

• • • •

ఏ కోరికలూ, ఆశలూ పెంచుకోక తన చెల్లెలి జీవితమైనా ఇంత ఎత్తులో ఉండాలని కోరుకోవడంతో వయస్సుని మించి బాధ్యతలు పెరగడంతో మధుకు జీవితం కోరుకున్న రకంగా లేదు. క్షణ క్షణం భయాల మధ్య,ఆవేదనల మధ్య. అతనికా సమయంలో ఎవరి హోదార్పయినా కావాలనిపిస్తూంది. అందుకే తన భారాన్ని స్నేహితునికి రాసుకోవాలనిపించింది.

"చందూ!

నా చిన్ననాటి జీవితం సుఖంగా, శాంతిగా గడిచిపోయింది. కానీ ఇప్పుడు అశాంతిగా, ఒంటరిగా—నా వల్ల కావడం లేదు.

నీవుకూడా అందరిలా నే నింకా సర్వ సంపదలతో పెరుగుతున్నానని భ్రమలో ఉన్నావేమో! చందూ! నీ కయినా నిజం చెప్పుకోవాలనిపిస్తూంది. ఇప్పుడు నా కున్న ఆస్తికి మించి అప్పు లున్నాయిరా. ఉన్న ఆస్తినంతా అమ్మేసి అప్పుల వాళ్ళకు కొద్ది కొద్దిగా నయినా సర్దేసి శాంతిగా సుజీని తీసుకుని ఎక్కడికైనా పారిపోవాలనిపిస్తూంది నాకు అప్పుడప్పుడు. కానీ సుజీ అయినా సుఖపడాలి. అందుకే అప్పులను దాచి నా ఆస్తిని మాత్రమేచూపి నా చెల్లెల్ని ఒక పెద్దింటి కోడలుగా చేయాలనే తాపత్రయంలో ఇంకా అప్పులు చేస్తూనే ఉన్నాను.

చందూ! చిన్నప్పటినుండి మా కుండే ఆస్తి వివరాలు కానీ, ఆస్తికి మించి ఉన్న అప్పులు కానీ సుజీకి నేను చెప్పలేదు. అందుకే సుజీ కోరికలు పెంచుకుంటుంది. సుకుమారంగా పెరుగుతూంది. నా చెల్లెలు కోరికలకు జీవం పోయడానికి నేనేమయినా చేస్తాను. ఇది నా బలహీనతే కావచ్చు. ఒప్పుకుంటున్నాను. సుజీ పెళ్ళయి అత్తవారింటికి పంపేశాక అప్పులవాళ్ళ నుంచి విముక్తి అయినా, కాకపోయినా ప్రపంచంలో నే నుండలేననిపిస్తూంది. అంతగా అలిసి పోయానురా. అందుకే నా జీవితంలో పెళ్ళి ప్రసక్తి లేదు. నా చెల్లి గొప్పింటి కోడలు కావాలి. అదే — అదే — నా కోరిక — ఒకే ఒక్క కోరిక. చందూ! నేను చాలా అశక్తుణ్ణి అయిపోతున్నానురా. నాకు ఎవరయినా ధైర్యం చెప్పే వ్యక్తి కావాలిరా. ఒక్కసారి నువ్వు రాకూడదూ?"

అలసటతో అతని కలం ఆగిపోయింది. ఎవరో పిలవడంతో ఆ అసం పూర్తి ఉత్తరాన్ని అలాగే టేబిల్ మీద వదిలేసి వీధిలో కెళ్ళిపోయాడు.

అలా వెళ్ళిన మధు బయట గొడవలతో ఇంకాస్త చీకాకుతో ఇంటి కొచ్చేసరికి ఇంటర్ పరీక్షలు పూర్తి చేసుకుని సెలవులకు ఇంటి కొచ్చిన సుజీవన ఎదురొచ్చింది.

అతని కా సమయంలో చెల్లెల్ని చూసేసరికి చాలా ఆనంద మనిపించింది. ఆ ఆనందంలో సుజీవనలో ఉదాసీనతను అతను గుర్తించ లేదు. అతని కిప్పుడు తోడు కావాలి. అంతే. చెల్లెలు రావడం చాలా పెద్ద ఆనందం అయిం దతనికి.

మధు అసం పూర్తిగా వదిలేసిన ఉత్తరం సుజీవన కంట పడింది. మోసగింపబడి విరక్తితో ఉన్న ఆ అమ్మాయి హృదయం ఆ ఉత్తరం చదవడంతో భారమై పోయింది. ఆమెలో పశ్చాత్తాపం నిలువునా దహించేస్తూంది. అన్న త్యాగం, ప్రేమ ఆమె గుండెలో కొండంత కృతజ్ఞతను రేపి క్షణాల్లో ఆమెలో ఒక నిర్ణయం జరిగిపోయింది.

"నువ్వింత తగ్గిపోయా వేమన్నయ్యా!" అడిగింది ఆప్యాయంగా అన్నను చూస్తూ. ఎప్పుడూ తన ఆనందాలకు అన్నను విసిగించడమే తెలిసిన సుజీ ప్రశ్నకు మధు కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి. అది కనిపించకుండా—

"నీకు నా మీద ఉండే ప్రేమలో అలా అనిపిస్తుంది కానీ నా కేం—పిడిరాయిలా ఉన్నాను" అన్నాడు చిన్నగా నవ్వి.

సుజీవన కళ్ళు చెమర్చాయి.

మరలా హాస్టల్‌కి వెళ్ళేవరకు ఎప్పటిలా కాకుండా అన్నను విసిగించకుండా అన్నకే అన్ని సౌకర్యాలు దగ్గరుండి ప్రేమగా అమర్చింది.

చెల్లెలికి కావల్సిన అవసరాలు ఎప్పటి కప్పుడు హాస్టల్‌కు వెళ్ళి కనుక్కొని తీర్చేవాడు మధు. ఎప్పుడూ ఏదో కావాలని సాధించే సుజీవన అన్నను "ఇప్పుడివన్నీ ఎందు కన్నయ్యా!" అని వారిస్తూంది. చెల్లెలి లోని మార్పు ఆమెకు ఆమె వయుస్సు తెచ్చి పెడుతూందని సరిపెట్టుకున్నాడు మధు.

చెల్లెలు డిగ్రీ చదువుకూడా పూర్తయ్యే రోజు దగ్గరయ్యేసరికి ఒక విధంగా మధు మనసు తేలిక పడింది. చదువు పూర్తవగానే తన చెల్లెలు అందం, చదువుతో సులభంగా మంచి సంబంధం దొరుకుతుందని ధైర్యం వచ్చింది. సెలవులకు ఇంటికి రాబోతూంది చెల్లెలు. ఫ్రెండ్స్‌కు పార్టీలు, సినిమాలు లాటి సరదా లుంటాయని వంద రూపాయల నోటు తీసుకుని హాస్టల్‌కు బయలుదేరాడు.

"పరీక్షలు బాగా రాశావా, సుజీ!"

"ఫస్ట్ క్లాస్ వస్తుం దన్నయ్యా. రేపొక్క పరీక్ష పూర్తయిపోతే ఇంకేం బెంగ లేదు" అని లోపలి కెళ్ళిం దామె అన్నను కూర్చోమని. తిరిగి రాగానే.

"ఇదిగోమ్మా ఈ వంద రూపాయ లుంచు ఖర్చులకు" అంటున్న అన్న వైపు భాష కందని కృతజ్ఞతతో చూసి, నోటందుకుని తన చేతిలో నలుగుతున్న కొన్ని పది రూపాయల నోట్లు చూపుతూ, "నీ వప్పుడప్పుడు ఇచ్చిన డబ్బులు దాచాను. రెండు మంచి షర్ట్స్ కొనుక్కో, అన్నయ్యా" అంది.

ఎప్పటి కప్పుడు సుజీ ప్రవర్తన వింతగా ఉండేది మధుకి. ఇలా చెల్లెలి దగ్గర నుండి ఒక చిన్న బహుమతి అందుకోవడం మధుకి కొత్త అనుభూతి—వింత ఆనందం.

"అన్నయ్యా! ఇంక కొద్ది రోజుల్లో నీ దగ్గర చాలా డబ్బుంటుంది. దేనికీ బాధ పడక్కర లేదు." జారి పడ్డ వంద రూపాయల నోటును వంగి తీసుకుంటూ సంతోషంగా అంటున్న చెల్లెలి వైపు చూస్తున్న అతని కనుబొమలు ముడి పడ్డాయి.

"మన కిప్పుడు బాధ లేమున్నాయి? కొద్ది రోజుల్లో నా దగ్గర చాలా డబ్బుండడ మేమిటి?"

"అబ్బెబ్బే! ఏం లేదు. నేను పాస్ అయితే ఉద్యోగం చేస్తానుగా! అప్పు డంతా డబ్బే." తత్తరపాటుగా అంది సుజీ.

చెల్లెలి వైపు ప్రేమగా, పరిశీలనగా చూశా డతను. కాస్త నల్లబడింది సుజీవన.

"నీకు ఉద్యోగమా? ఉహుఁ! నీ అందం చదువు చూసి ఏ రాజకుమారుడో వస్తాడు." కలల్లో తేలిపోతున్నా డతను.

ఆ సాయంత్రం సుజీవన అన్న వచ్చాడని తెలిసి అతన్ని వార్డెన్ పద్మావతీదేవి పిలిపించింది. తన డాక్టర్ చదివే కొడుకు సుజీవనను చేసుకోవడానికి కష్ట పడుతున్నాడనీ, తనకీ సమ్మతమే ననీ, కానీ

సుజీవన ఒప్పుకోవడం లేదనీ ఫిర్యాదు చేసింది.

చెల్లెల్ని మందలించాడు మధు.

''చదువుకునేటప్పుడు ఆ ఆలోచనలు నా కిష్టం లేదన్నయ్యా. పాస్ అయ్యాక మీ ఇష్టమే నా ఇష్టం'' అనేసి అక్కడ నుండి తప్పించుకుని వెళ్ళి పోయింది.

తన చెల్లెల్ని ఇష్టపడి ఒక డాక్టరు చేసుకోవా లనుకుంటున్నాడనే వార్త అతన్ని ఆనందంలో ముంచింది. ఆ పారవశ్యంలో ఎప్పటిలా ఏ స్నేహితుడి రూమ్‌లోనో గడపక ఖర్చయినా ఫరవాలేదని లాడ్జికి దారి తీశాడు.

అప్పుడే ఆకాశం ఎర్ర చీర కట్టుకుంటూంది. అతని మనసంతా ఆకాశంలో బారులు తీరి ఎగిరే పక్షుల్లా ఉంది. జేబులోకి చేయి పోనిస్తే బీడీ తగిలింది. అంత ఆనందంగా ఉండే మూడ్‌లో బీడీ తాగాలనిపించ లేదు. రూమ్ తీసుకున్నాక బాయ్‌ని పిలిచి సిగరెట్ పాకెట్ తెమ్మన్నాడు.

బాయ్ సిగరెట్ పాకెట్ తెచ్చి అందిస్తూ, ''ఇంకే మైనా కావాలా, సార్?'' అని వంకర నవ్వు నవ్వుతూ అడిగాడు.

ఇంకెప్పుడయినా అయితే లాడ్జికి వచ్చేవాడూ కాదు, ఆ బాయ్ వంకర నవ్వుకు అర్థం స్ఫురించేదీ కాదేమో కానీ, ఈ రోజు అతని చెల్లెల్ని ఒక డాక్టరు తన జీవితంలోకి ఆహ్వానిస్తున్నాడనే ఆనందంలో అతనూ ఒక వంకరన వ్వు నవ్వేసి ''రేట్ ఎంతోయ్?'' అన్నాడు. ''వంద రూపాయలు సార్, ఇప్పుడే తీసు కొస్తాను. అయితే మూడు గంటల పైన ఉండదు సార్. చదువుకునే పిట్ట మంచి సరుకు.'' మరలా అదే నవ్వు.

చెల్లెలుఇచ్చిన వందరూపాయలు జేబులో ఉన్నాయి షర్ట్ కొనుక్కునే బదులు ఇలా ఆనందాన్ని కొనుక్కుందామనిపించింది. ''సరే'' అన్నాడు.

వయసు చేసే అల్లరిని, ఆ కోరికల్ని ఎప్పటి కప్పుడు అణచి పెట్టే అతను తన బాధ్యత, తన కోరిక ఇంత తేలిగ్గా నెరవేర బోతున్న ఈ తరుణంలో తన కొరకు తను ఈ రాత్రి బతక దలుచుకున్నాడు.


ప్రతి క్షణం ఆ రాబోయే చదువుకున్న పిల్ల ఎలా ఉంటుందో? తనెలా ఆవిడతో ఆనందం పంచు కోవాలో? తనకు దొరికిన ఈ అపురూపమైన అవకా శాన్ని, ఈ మొదటి అనుభవాన్ని ఎలా వాడుకోవాలో ఊహిస్తూ రూమ్‌లో లైటుకూడా వేసుకోకుండా కిటికీలోనుండికిందకు చూస్తూ సిగరెట్టు కాలుస్తూ గడుపుతున్నాడు.

రూమ్ తలుపులు తెరుచుకున్నాయి.

''నే నొస్తాను సార్, మూడు గంటల సేపే సార్. హండ్రెడ్ రుపీస్''అని చెప్పేసివాడు వెళ్ళిపోయాడు.

ఆమె అందాన్ని చూడాలనే తొందరలో లైటు వేసి ఎదురుగా నిలిచిన సుజీవనను చూసి అదిరి పడ్డాడు. సర్వం అయోమయం సర్వం విభ్రాంతి. అతనిలో అణువణువునా నిస్పృత్తువలో ముంచే అతి భయంకరమైన సంఘటన అది.అతనికి తనెక్క డున్నాడో? ఏం జరుగుతూందో అర్థం కావడం లేదు.

సుజీవన మొదట బిత్తర పోయింది. ఆ తరవాత




వెక్కి వెక్కి ఏడుస్తూ అన్న కాళ్ళమీద పడిపోయింది. ఆ స్పర్శతో మధుమూర్తి ఈ ప్రపంచంలోకి వచ్చాడు.

''నువ్వు...నువ్వు...ఇలాటిదని...ఛీ. ఛీ,ఛీ''అతను అరిచాడు కీచుగా. ఆ తరవాత ఎగిసి ఆమెను కాలితో తన్నాడు. ఒక్క ఉదుటున చెల్లెల్ని లేపి ఒడిసి పట్టుకుని.

''నీ లాటి పాతకి బతక్కూడదు. బతకనే కూడదు'' అన్నాడు. అతని చేతులు ఆమె గొంతు మీద బిగుసుకున్నాయి. అతని ఆవేశం చల్లారక ముందే ఆమెలో రక్తప్రసరణ ఆగిపోయింది.

● ● ● ●

తనని చూడాలని వచ్చిన వ్యక్తిని చూసి మధు మూర్తి కళ్ళు పెద్దవి చేశాడు.

''నా కంతా తెలిసింది.'' తల దించి చిన్నగా అంది పద్మావతీదేవి. మధుమూర్తి కలవర పడ్డాడు. ఇప్పటివరకు తన చెల్లెలు చేసిన తప్పు ఎవ్వరికీ చెప్పుకో లేదతను.

''సుజీవన అప్పజెప్పిన బాధ్యతను మీకు అప్ప జెప్పి పోదామని వచ్చాను.''

''ఆ పాతకి పేరు నా దగ్గ రెత్తకండి. ప్లీజు.'' తన చెల్లెలి కథ ఇంకో వ్యక్తికి తెలిసి పోయిందనే ఉక్రోషంలో అతని ఆవేశం అంచులు దాటింది. చెల్లెలు చచ్చిపోయినా అందరి దృష్టిలో శీలవతిగా మిగలాలని అతని కోరిక. మరో ఆడపిల్ల శీలాన్ని దోచుకున్న మగాడికికూడా భార్య శీలం, చెల్లెలు శీలం మాత్రం సురక్షితంగా ఉండాలని ఉంటుంది.

''ఆమె అలా ఎందుకు చేసిందో మీకు తెలుసా?'' పద్మావతీ దేవి అడిగింది.

''తన కోరికలన్నీ అన్న తీరుస్తుంటే అది చాలక కొవ్వెక్కి చేసింది.''

తన చెల్లెలు చేసిన తప్పు తనకు తెలుసునని చెప్పాక ఆమె దగ్గర తను దాచి పెట్టాల్సిందేమీ లేదని పించిం దతనికి.

''మధుమూర్తిగారూ! విచక్షణా జ్ఞానం నశించి ఆమెను మీరు హత్య చేయడం తప్పు కాదా?'' ఆమె శాంతంగానే ప్రశ్నించింది.

కటకటాల మీద అతని చేతులు బిగుసుకున్నాయి.

''పద్మావతీదేవిగారూ! నేను చేసింది తప్పేనండీ. నా చెల్లెల్ని బీదరికంలో చూడకూడదని నా స్తోమతకు మించి పెంచటం తప్పే. నా తండ్రి నన్ను పెంచినట్టే నా చెల్లెల్ని నేను పెంచాలనుకున్నాను. కానీ నా తండ్రి చేసిన ఒక్క పొరపాటు మాత్రం నేను చేయదలుచుకోలేదు. అదే చదువులో అశ్రద్ధ. అందుకే నా చెల్లెల్ని హాస్టల్‌లో ఉంచి, గొప్పవాళ్ళ మధ్య పెరిగే నా చెల్లెలికి ఏ లోటూ జరగకుండా అన్ని అవసరాలు తీర్చడం నా తప్పేనండీ.''

అతను ఆగి మరలా చెప్పడం ప్రారంభించాడు:


''చిన్నతనం నుండీ ఖరీదైన బట్టలకు అలవాటు పడిన నేను నా చెల్లెలికి మంచి చీరలు కొనడం కోసం మానేశాను. బూట్లు కలవాటైన నా పాదాలు రబ్బరు చెప్పులకు అలవాటైనా, నా చెల్లెలు చేయిని మాత్రం మట్టి గాజులకు అలవాటు పడనీయలేదు. అదీ నా తప్పేనండీ. చదివి చదివీ బలహీనమయి పోతుందని పొద్దున పేసు చద్దన్నం తింటున్నా, హార్లిక్స్ సీసా తీసుకెళ్ళి నా చెల్లెలి కందించడం నేను చేసిన తప్పేనండీ! ఇవన్నీ...ఇవన్నీ నా తప్పులే నండీ.''

హత్య జరిగిన నాటినుండి ఏ ఒక్కరితోకూడా బాధను పంచుకోవడాని కిష్టపడని మధుమూర్తి తన చెల్లెలి రహస్యం తెలిసిన వ్యక్తి ముందు తన గుండెలోని భారాన్ని దించుకుంటున్నాడు ఒక రకంగా.

''మిమ్మల్ని, మీ బాధను నేను అర్థం చేసుకో గలను. కానీ మీరు కోరుకున్నట్టే మీ చెల్లెలు కూడా సుఖంగా ఉండాలని కోరుకోవటంలో ఆ తప్పు చేసి ఉంటే...''

''ఏమిటి మీ రంటున్నది?'' అర్థం కానట్టు చూశా డతను.

''మనిషికీ మనిషికీ మధ్య స్నేహం ఎందుకు కలుస్తుందో, ఇన్ని కోట్ల జనాభాలో మనకు కొందరే ఎందుకు నచ్చుతారో తెలీదు. సుజీవన నాకు నచ్చింది.







ఆమె హాస్టల్‌లో చేరిన ఈ మూడేళ్ళ నుండి ఎప్పుడు మేము కలుసుకున్నా మా అన్నా చెల్లెళ్ళ కబుర్లే వినిపించేది. మా అన్నయ్య మాకు ఆస్తి హరించుకు పోయిందనే సత్యాన్ని దాచి, నా ఆనందానికి అతని సుఖాలను బలి పెట్టాడు. నన్ను పెద్దింటి కోడల్ని చేయాలని కలలు కంటున్నాడు. చిన్నప్పటి నుండి పరిస్థితులు తెలియక మా అన్నయ్యను విసిగించాను. ఇక ఎలాగైనా మా అన్నయ్యను సుఖ పెట్టాలి అనేది.

'ఎలాగైనా' అనే పదానికి అర్థం స్ఫురించ లేదు నా కప్పట్లో. మీరు ఖర్చుల కంటూ డబ్బిస్తే భద్రంగా మీ సుఖాని కంటూ దాచేది. ఖరీదైన చీరలు కొనుక్కోవడానికి మీ రిచ్చిన డబ్బు మీ కోసమే ఎప్పటి కప్పుడు నా దగ్గర దాచింది. పుస్తకాలు కొనుక్కోకుండా లైబ్రరీలో చదివేది.

నా కొడుకు ప్రేమను సుజీవన చూరగొన్నప్పుడు నేను సుజీవనమే తెలిపితే, తాను ఇంటర్ సెకండియర్‌లో సుధీర్ అనే అబ్బాయిని ప్రేమించి వివాహం చేసుకుంటాడనే ధీమాతో అతనికి తన సర్వస్వం అప్పగించిందనీ, ఆ అబ్బాయి పెళ్ళికి తిరస్కరించాడనీ నిజాన్ని నిర్భయంగా నా ముందుంచింది. ఆ చేదు నిజాన్ని నా లోనే దాచుకుని, నా కొడుకుతో సుజీవన వివాహానికి మనఃస్ఫూర్తిగా అంగీకరించాను. అందుకు సుజీవన ఎంతమాత్రం ఒప్పుకో లేదు. మలినమైన శరీరాన్ని పెళ్ళి అనే పవిత్రమైన బంధంతో ముడి వేసి అపవిత్రం చేయనంది. జన్మలో పెళ్ళి అనే ప్రశ్నే తన జీవితంలో లేదంది. 'పొరపాటు చేయని వారెవరూ ఉండరు. వాటిని దిద్దుకుని మన జీవితాల్ని సుఖమయం చేసుకోవాలి. మన కుండేది ఒకే ఒక్క జీవితం' అని నే నెంత నచ్చచెప్పబోయినా వినలేదు.

మూడు గంటల సేపు ట్యూషన్ చెపితే నెలకు రెండు వంద లిస్తామన్నారనీ, ఇలా అయినా అన్నయ్య భారం తీర్చాలనీ నాతో చెపితే సుజీవన మీదుండే నమ్మకంతో అందుకు సులభంగా అనుమతి ఇచ్చాను.

ఆ అనుమతి సుజీవన జీవితం ముగిసి పోవడానికి దారి తీస్తుందని నా కప్పుడు తెలియలేదు. ఈ మూడేళ్ళుగా ఆ అమ్మాయి ట్యూషన్ సాగిస్తూనే ఉంది. హఠాత్తుగా ఒక రోజు నెల నెలా నా దగ్గర దాచే రెండు వందలు కాక, ఒక పెద్ద నోట్లకట్ట నా చేతి కందించింది. నేను ఆశ్చర్యంతో నోరు తెరిచి ఇంత డబ్బెక్కడిదీ అని అడిగే ప్రశ్నకు జవాబుగా నా చేతిలో ఒక లాటరీ టిక్కెట్టుంచి ప్రైజు వచ్చిందని సంతోషంగా చెప్పింది.

అలవాటు ప్రకారం ట్యూషన్ చెప్పడాని కని వెళ్ళిన సుజీవన మరి తిరిగి రానంత దూరం వెళ్ళిపోయింది. ఎవరి సుఖం కోసం ఎంతగా తపించిందో, అతని చేతిలోనే దారుణంగా హత్య చేయబడిందని తరవాత తెలిసింది." ఆవేశంగా చెపుతున్న పద్మావతీదేవి అలసటగా ఆగింది.

"నన్ను మభ్య పెట్టింది సుజీవన. అందుకు నేను బాధ పడటం లేదు. తన అన్న సుఖపడడానికి ఆమె ఎన్నుకున్న మార్గం సరియైనది కాదని ఆ ఆవేశంలో ఆ పిల్లకు స్ఫురించనందుకు బాధ పడుతున్నాను. తను ఎన్నుకున్న మార్గం వల్ల తన భవిష్యత్తు ఎంత నాశన మవుతుందో ఆ పసిపిల్లకు అర్థం కానందుకు విచారంగా ఉంది. జరిగిన వాస్తవం ఈ రోజే నాకు తెలిసింది. అదీ మా వాచ్‌మన్ అతి తాగుడు ప్రభావం వల్ల.

"మధుమూర్తిగారూ! ఏనాడైతే సుజీవన లేత మనసు మీద సుధీర్ గాయం చేశాడో, ఆ రోజే ఆ అమ్మాయి జీవితం అంతం చేసుకోవాలనుకుంది. కానీ తన అన్నను ఒక్కమారు చూసి ఆ పని చేయాలని ఇంటి కొచ్చే వరకు ఆగింది. సెలవుల కింటి కొచ్చిన రోజు మీరు మీ స్నేహితుడు చందూకి రాసిన జాబు చూసి నిలువెల్లా పశ్చాత్తాపంతో కుంగిపోయింది. ఆ రోజే తనొక నిర్ణయాని కొచ్చింది. మిమ్మల్ని తను సంపాదించిన డబ్బుతో అప్పుల నుండి విముక్తుణ్ణి చేసి, మీ ఆస్తిని మీకు దక్కింప చేయా లనుకుంది. అలా అని నాకు చెప్పే సుజీవనను చూస్తే గర్వంగా ఉండేది. కానీ, డబ్బు సంపాదనకు తుచ్ఛమయిన దారి వెతుక్కుంటుందని మాత్రం వూహించలేక పోయాను. అక్కడ నన్ను మభ్య పెట్టిన మాట వాస్తవమే కానీ, ఎవరి కోసం ఆ అమ్మాయి ఇంకా ఇంకా పతన మయిం దంటారు?

"ఆ మూడేళ్ళల్లో తనలోని అందాన్ని ఖరీదుకు పెట్టి, వాళ్ళు తన అందాన్ని జుర్రుకుంటే, తను ఎదుట వ్యక్తి నుండి డబ్బును జుర్రుకుంది. వాచ్‌మన్‌ను డబ్బుతో మంచి చేసుకుని మూడు గంటల సేపు తను వస్తానని, ఆ ఏర్పాటు చేయమని ప్రాధేయ పడింది. హఠాత్తుగా అన్న అప్పులు తీర్చి, అన్నను బతికించు కోవడానికి అంతకంటె మరో మార్గం కనిపించలేదు కాబోలు. రోజుకు వంద రూపాయ లెవరిస్తారు అనుకుందేమో!

అన్ని అనుభవాలు జీర్ణించుకున్న ఆ ముసలివాడు వద్దని వారించబోతే—

"ఈ మూడు సంవత్సరాలు ఎంతైనా ఇలాగే సంపాదిస్తాను. చదువు పూర్తయి, నా హాస్టల్ జీవితానికి గుడ్‌బై చెప్పే రోజు ఇక నా జీవితానికికూడా 'గుడ్‌బై' చెప్పేస్తాను. కానీ, ఈలోగా నేను సంపాదించే డబ్బుతో నా అన్న సుఖ పడాలని అంటూ వాచ్‌మన్ గుప్పెట్లో పెద్ద నోటు పెట్టేసరికి ఆ ముసలివాడికి సారా గుర్తొచ్చింది. అంతే. ఆ పిల్లకు కావలసిన దారులు వెతికాడు.

సుజీవన తను చూపిన దారిలోకి వెళ్ళి హత్య చేయబడిందనే సత్యం తెలిసిన వాచ్‌మన్ ఆ అశాంతిలో పూర్తిగా తాగేసి, నా రూమ్‌కు కొచ్చి తనకు తెలిసిన నిజాన్ని నాకు చెప్పేశాడు. సుజీవన ఎన్నుకున్న మార్గం తప్పే కానీ, ఆ తప్పు ఎవరి కోసం చేసిం దంటారు?"

"ఆపండి. ఆ తప్పును సమర్థించడానికి ప్రయత్నించకండి. మీ రిక్కడ నుండి వెళ్ళిపోండి." కర్కశంగా అరిచాడు మధుమూర్తి. అతని గుండె మండిపోతూంది. తన చెల్లెలు చేసిన పని, ఆమె చావుకూడా అతణ్ణి పిచ్చివాణ్ణి చేస్తున్నాయి.

"వెళ్ళిపోతాను. వెళ్ళిపోబోయే ముందు ఆ డబ్బు ఏం చేయమంటారో చెప్పండి."

"ఆ పాపిష్ఠి డబ్బు నా కక్కర లేదు. ఆ డబ్బుతో నేను సుఖ పడాలని మీరూ అనుకుంటున్నారా?"

పద్మావతీదేవి చివ్వున తలెత్తింది. ఆమె కళ్ళలో ఎర్రని జీరలు.

"మిస్టర్ మధుమూర్తీ! ఏమిటి మీ రంటున్నది? ఆ పాపిష్ఠి డబ్బుతో సుఖపడలేననా? హాహ్! చెప్పండి, సార్? మీ కో న్యాయం, కో న్యాయమూనా? నీతి తప్పి సుజీవన డబ్బు సంపాదించాలని కోరుకుంటే, అదే నీతి తప్పి సుఖాన్ని కోరుకున్నారు మీరు. అంతేగా? సుజీవన తప్పు చేసిందనేగా హత్య చేశారు? మరి మిమ్మల్ని ఎవరు హత్య చేయాలి? మీరూ అదే ఉద్దేశంతో కదా అక్కడుంది.

చెప్పండి, ఆడదాని కో నీతి, మగాడి కో నీతి ఉండాలా? నీతి తప్పిన ఆడదాన్ని ఈ సమాజం బతకనివ్వదు. అదే నీతి తప్పిన మగవాడు బాహాటంగా అందరిలో చెప్పుకోగలడు. ఎక్కడుందండీ ఈ వ్యత్యాసం? పుట్టుకలోనే మగ, ఆడ అనే పేర్లలోనే ఉందనే కదా మీ అహంభావం! ప్రకృతి సిద్ధంగా ఆడపిల్ల బలహీనురాలు కాబట్టే కదా సుజీవన ఒక కామాంధుడికి బలైంది. అదే బలహీనురాలై మీ చేతిలో ఘోరంగా చంపబడింది." అంతవరకు ఆవేశంగా

మాట్లాడుతున్న పద్మావతీదేవి బ్లైవ్ అయిపోయిందని చెప్పగానే అక్కడనుండి చర చర [illegible]ంది.

• • •

డల్‌గా శూన్యంలోకి చూస్తూ ఆలోచించే పద్మావతీదేవిని చూడడం హరిప్రసాద్ సంసార జీవితంలో మొదటిసారి. అందుకే అడిగాడు—

"ఏమయింది పద్మా, అలా ఉన్నావు?"

"ఈ సృష్టిలో మగాడికో నీతి, ఆడదానికో నీతి. ఎందుకా వ్యత్యాసం?"

"ఏమిటోయ్ సృష్టిమీద ధ్వజమెత్తావ్? విశేష మేమిటి?"

"మధుమూర్తి, సుజీవనల కథ మీకు తెలుసుగా. తప్పు చేసిందనే ఉక్రోషంతో ఆ అమ్మాయిని చంపేశాడు కదా! అదే తప్పు మధుమూర్తి చేయడానికి సంకల్పించినప్పుడు ఆపిల్లకూ అంతే ఉక్రోషం ఎందుకు రాకూడదు?"

"ఆడపిల్ల అవినీతికి పాల్పడితే నష్ట పోయే దెవరంటావ్?"

"నిజమే. నేనూ ఒప్పుకుంటాను. అవినీతి వల్ల నష్టపోయేది ఆడపిల్లే. ఆడపిల్లను నైతిక విలువల నుండి జారి పొమ్మనను నేను. అదే నైతిక విలువల నుండి మగపిల్లవాడూ జారకూడ దంటాను."

"పద్మా! మగవాడు తప్పు చేసినా శారీరకంగా అతనిలో ఏ మార్పూ రాదు. అదే ఆడపిల్లఅయితే?"

"ఒప్పుకుంటాను. మానసికంగా మగవాళ్ళెందుకు దిగజారి పోవాలి?" చాలా బాధగా అంది.

"ఆడపిల్లలు దిగజారడం లేదా? సుజీవన తన అన్నను సుఖ పెట్టడానికి ట్యూషన్లే చెప్పుకోవచ్చు. ఆ డబ్బు చాలదనుకుంది. ఇంకా ఎక్కువ డబ్బు వచ్చే మార్గాన్నిఎన్నుకుంది. అది ఎవరి తప్పంటావ్?

"సుజీవన తన అన్నను సుఖపెట్టడానికి ఎన్నుకున్న మార్గం చాలాజుగుప్సాకరమైనదనినేనొప్పుకుంటాను. ఆ దారిలో సంపాదించిన డబ్బుతో తన అన్న సుఖపడాలనుకోవడం అవివేకమే. కానీ అదే తప్పు చేయడానికే ఆ రూమ్‌లో ఉన్న మధుమూర్తి ఒక్క క్షణం. ఒక్క క్షణం చాలు ఆత్మ పరిశీలన చేసుకుని ఉంటే, ఆ అమ్మాయిని అమానుషంగా చంపేవాడా?

"అంటేఆమ్మాయిలుచెడిపోయినా, ఆ అమ్మాయి శ్రేయోభిలాషులుకూడా ఆ పిల్లను దండించ కూడదంటావా?"

"నో. నే నలా ఎప్పటికీ అనను. ఇద్దర్నీ శిక్షించాల్సిందే. కానీ కొందరు మగవాళ్ళు నైతిక విలువలు లేకుండా ఇష్టం లేని ఆడపిల్లను సైతం అన్యాయం చేస్తుంటే ఆ అమ్మాయి నైతిక విలువలకు ప్రాణం ఇచ్చే పిల్లయి ఉరి పోసుకుంటే, సంఘ సంస్కరణ అంటూ గొంతులు చించుకుని అరిచే వాళ్ళంతా ఏం చేస్తున్నట్టు? అర్ధరాత్రి అమ్మాయిలు నిర్భయంగా రోడ్డున నడిచే రోజులు కల్పిస్తామని ఉపన్యాసా లిచ్చే వాళ్ళంతా ఎందుకు కళ్ళు మూసుకుని ఉన్నట్టు?"

"వాళ్ళకు సరిగ్గా సమాచారం అందాలి కదా? అయినా చర్య తీసుకోవడం లేదు అంటావా?'

పద్మావతీదేవి ముఖం ఎర్ర బారింది. గొంతులో ఆవేశం పెల్లుబికింది. "సమాచారం అందకుంటే పేపర్‌లోని ఈ వార్తలన్నీ ఎలా వస్తున్నాయి? ఆడపిల్లలపై అత్యాచారాలు సాగిస్తున్న దుర్మార్గుల్ని ఎందుకు శిక్షించరు?"

"కేసు దర్యాప్తు చేసి తప్పని సరిగా శిక్షిస్తారు?".

"ఎప్పుడు? ఎక్కడ వింటున్నామండీ పేపర్‌లో ఇలాటి ఘోరమైన వార్తలు చదవడమే కానీ వాటికి బాధ్యులైన వ్యక్తులకు కఠినమైన శిక్ష విధించడం జరుగుతూందా?" తన భార్యనే చూస్తూ ఆమె ఆవేదనా పూరితమైన మాటలను వింటున్నాడు హరిప్రసాద్‌గారు.

"అమానుషంగా ప్రవర్తించే వ్యక్తుల్ని ఉరికంబాని కెక్కిస్తే కామంతో కళ్ళు మూసుకుపోయినా, మానవత్వం నశించినా కళ్ళెదుట కనిపించే ఆ కఠిన శిక్షకు భయపడి ఎదుటపడ్డ ఆడపిల్లను తన తల్లిగానో చెల్లిగానో చూడలేక పోయినా అలాంటి వారు ఇలాంటి ఘోరాతి ఘోరాలకు పాల్పడరు."

"పద్మా! నీ వన్న దాంట్లో తప్పు లేదు. కానీ ఆడపిల్లలుకూడా మారాలి. వాళ్ళు ధనార్జన కంటూ వేశ్యలుగా మారని రోజు నీ వనుకున్న రోజు నీ కళ్ళ ముందు ఉంటుంది. ఈ రోజుల్లో ఎప్పుడూ ఏదో ఒక పని ఉంటూనే ఉంది. పైర్లు నాటడం, వరి కోయడం, కలుపులు తీయడం లాంటిపనులు చేతకాని వారికి ఎన్నో ఎన్నెన్నో పనులు ఇంటి వద్దే చేసుకుంటూ సాయంత్రానికి సుమారు పది రూపాయలు సంపాదించుకోగలుగుతున్నారు. నీతిగా సంపాదించుకోవచ్చు. అలా కాకుండా 'పది రూపాయలతో మా జీవితా లేం గడుస్తాయి?" అని విలాస జీవితానికి వాళ్ళ శరీరాల్ని అలవాటు చేయాలని అక్రమ సంపాదనకు పరుగులు తీస్తున్నారు.

మగవాడిదీ తప్పే. కాదనను. కానీ ఆడపిల్ల స్నేహం పేరిటకూడా మగవాడి చెంతకు చేరకుంటే ఇలాటి ఘోరాలు తగ్గుతా యనను. కానీ చాలా వరకు తగ్గిపోతాయి. మగ ఆడ అనే తేడా లేకుండా ఇద్దరూ పవిత్రంగా ఉండగలిగిననాడు ఇలాటి వార్తలు మన చెవిన పడవంటున్నాను. అవినీతి ఎల్లకాలం రాజ్య మేలదు. నీవు ఎదురు చూసే ఆ 'రోజు' తప్పకుండా వస్తుంది. ఇక నిద్రపో. ఈ మధ్య రోజూ ఇదే ఆలోచిస్తున్నట్టున్నావు. చిక్కిపోయావు కూడా."

నలభై అయిదేళ్ళ పద్మావతీ దేవి భర్త గుండెలో తల దూర్చి తన అశాంతిని మరిచిపోవడానికి ప్రయత్నించింది. ★

Printed and Published on behalf of
Andhra Prabha Pvt. Ltd. by MANOJ KUMAR SONTHALIA
at the Dinamani Press, Express Estate, Madras-600 002,
Editor: POTTURI VENKATESWARA RAO

## కొత్త పుస్తకాలు

### పోతన భాగవతము

(తాత్పర్య సహితము. ప్రథమ స్కంధము. ప్రథమ సంపుటము. ప్రచురణ: కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి. డెమి. పుటలు 280. వెల: ఎనిమిది రూపాయలు.)

**ఆంధ్రుల** అభిమాన గ్రంథం పోతనగారి భాగవతం. నిజానికి తిక్కనగారి భారత రచనకంటె పోతనగారి భాగవతమే కఠినోదాత్తమైన శైలి కలది. కాగా అర్థమైనా, కాకపోయినా తెలుగువారు భాగవతమే చదువుకొని ఆనందిస్తారు. అది భక్తికి నిధానం కావడమే అందుకు ముఖ్యకారణం. భాగవతంలోని ప్రతి పద్యం సద్యోముక్తి ప్రదాయకమైన రస గుళిక, కైవల్యప్రాప్తికి వెలుగుబాట.

ఈ సంపుటంలో పోతనగారి పద్యాలకు హృద్యమైన తాత్పర్యం శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి రచించారు. తాత్పర్యమే ఇంత హృద్యంగా ఉన్నది పోతనగారి పద్య మెంత అనవద్యమో అనిపించేవిధంగా మనోజ్ఞంగా సాగింది తాత్పర్య రచన.

భీష్మస్తుతిలో "హయరింఖాముఖ ధూళి ధూసర పరిన్యస్తాలకోపేతమై" అనే ప్రసిద్ధమైన పద్యానికి కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి తాత్పర్యం చూడండి.

"గుర్రాల గిట్టలు లేపిన దుమ్ము కొట్టుకొని రంగు చెడి చెదిరిన ముంగురులతోను, గమనవేగం వల్ల కందళించిన ఘర్మబిందువులతోను కూడి ముచ్చటగొల్పే ముఖం కలవాడై కిరీటిని గెలిపించాలనే కుతూహలంతో నా శరాఘాతాలకు బాగా బాధపడుతూ కూడా విష్ణుచక్రణ్ణి ప్రోత్సహించి పోరించిన మహానుభావుణ్ణి మనస్సులో అశ్రాంతమూ ధ్యానిస్తున్నాను."

పద్యంలోని సమాసాలకు మరింత సంగతమూ, విధేయమూ అయిన అర్థం చెప్పినట్లుంటే చదువరి పోతనగారి కవితను హారంగా అనుభవించడానికి వీలుంటుంది. శైలీ సౌకుమార్యానికి ప్రాధాన్యమిచ్చి వచనంలో వాడే పర్యాయ పదాలు సామాన్య పాఠకులకు కొరుకుడు పడవు. సహజ గ్రాహ్యత కొరవడకుండా ఈ తాత్పర్య రచనలో మరింత ప్రసాద గుణం ఉండాలనిపిస్తుంది. అలా ఉన్నప్పుడే ఈ పుటలోని పద్యాలన్ను, ఆ పుటలోని తాత్పర్యలను అందరు చదువుకొని ఆనందించడానికి వీలవుతుంది.

-ఉత్పల